ఆశలు.. అడియాసలు

- ఆగిపోయిన పీఏబీఆర్ కాలువ నీటి సరఫరా
- నిరాశలో అన్నదాతలు
- అధికారుల నిర్లక్ష్యమే కారణం అంటున్న రైతాంగం

తాడిమర్రి: మండలంలోని చెరువులు నింపడానికి ప్రభుత్వం విడుదల చేసిన పీఏబీఆర్ కుడికాలువ నీరు చెరువులకు చేరకనే ఆగిపోయింది. దీంతో మండల రైతుల ఆశలు అడియాశలయ్యాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే మండల చెరువులకు నీరు చేరలేదని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని నార్శింపల్లి, నిడిగల్లు, తాడిమర్రి తూర్పు, పడమర చెరువులు, ఎం.అగ్రహారం చెరువులు ఉన్నాయి. వీటి కింద సుమారు 750 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. అలాగే ఏకపాదంపల్లి, పుల్లానారాయణపల్లి, మేడిమాకులపల్లి గ్రామాల్లో కుంటలు ఉన్నాయి. ఈ కుంటలు నిండటంతో సుమారు 150 ఎకరాల సాగుకు ప్రయోజనం కలగనుంది. అలాగే శివంపల్లి, తాడిమర్రి, మోదుగులకుంట, బంగారంపేట, చిల్లకొండయ్యపల్లి, మర్రిమాకులపల్లి తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగనున్నాయి. మండలంలోని చీనీ, మామిడి, అరటి, జామ తదితర పండ్లతోటలు విస్తారంగా సాగవుతున్నాయి. వరుస వర్షాభావ పరిస్థితులతో బోరు బావుల్లో నీటి మట్టం పూర్తిగా పడిపోయింది. దీంతో రైతులు పండ్లతోటలను కాపాడుకోవడానికి రూ.లక్షలు ఖర్చుచేసి బోర్లు వేసిన ఫలితం లేకుండా పోయింది. చివరకు రైతులు ప్రభుత్వం ఏటా విడుదల చేస్తున్న పీఏబీఆర్ నీటిపైనే ఆధారపడ్డారు.


నీరు లేక వెలవెలబోతున్న తాడిమర్రి తూర్పు చెరువు


పీఏబీఆర్ కుడి కాలువలో నీటి సరఫరా ఆగిపోయిన దృశ్యం

పర్యవేక్షణ కరువు..

కాలువపై అధికారుల పర్యవేక్షణ కరువవ్వడంతో రాప్తాడు, అనంతపురం, బత్తలపల్లి మండలాల్లోని కొన్ని గ్రామాల రైతులు ముందుగా వారి చెరువులను నింపుకునే ప్రయత్నం చేశారు. అలాగే నార్పల మండలం బండ్లపల్లి పప్పూరు చెరువు రైతులు మళ్లించుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో చిట్ట చివరన ఉన్న మండల చెరువులకు నీరు చేరడానికి 10 రోజులు పట్టింది. ఒక్కో మండలానికి 15 రోజుల ప్రకారం డిసెంబర్ 5 నుంచి 25 తేదీ వరకు నీటిని విడుదల చేశారు. దీంతో ఎం.అగ్రహారం చెరువుకు కేవలం 10 శాతం నీరు చేరలేదు. మేడిమాకులపల్లి, పుల్లానారాయణపల్లి, ఏకపాదంపల్లి గ్రామాల్లోని కుంటలకు సగంలోపే నీరు చేరింది. తాడిమర్రి పడమటి చెరువులో పడీపడకనే నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో మండలంలోని పండ్లతోటల పరిస్థితి ప్రశ్నార్థంగా మారింది. పై ప్రాంతాల రైతుల స్వార్థం, అధికారుల నిర్లక్ష్యం వెరసీ రైతులకు శాపంగా మారింది. మరో పది రోజులు కేటాయించి నీటిని విడుదల చేసి మండల చెరువులకు కనీసం సగానికైనా నీటి సరఫరా చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

పండ్లతోటలను కాపాడాలి


తోటలను

మండలంలో వరుస వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయాయి. దీంతో ఉన్నఫలంగా బోరు బావులు ఎండిపోతున్నాయి. మరోపక్క బోర్లలో నీరు సక్రమంగా రాక పండ్లతోటలు ఎండి పోతున్నాయి. మరో పది రోజులు కేటాయించి పండ్ల తోటలను కాపాడాలి.

–ముక్కర నారాయణరెడ్డి, మరవపల్లి, తాడిమర్రి

10 శాతం నీరు కూడా చేరలేదు


నీరు

మండలంలోని ఎం.అగ్రహారం చెరువుకు కనీసం 10 శాతం నీరు కూడా చేరలేదు. చెరువుకు ఉత్తరం వైపున మరవపల్లి తూము ఉంది. దక్షిణం వైపున ఎం.అగ్రహారం తూము ఉంది. చెరువును నింపడానికి అధికారులు విడుదల చేసిన పీఏబీఆర్ కాల్వనీరు మరవపల్లి వైపున చిన్న, చిన్న గుంతల్లోకి మాత్రమే వచ్చాయి. ఆ నీరు పశువులకు నీరు తాపడానికి పది రోజులకు కూడా సరిపోవు.

–సంగాల శీనప్పఎం.అగ్రహారం, తాడిమర్రి

షెడ్యూల్ ప్రకారం సరఫరా చేశాం

జిల్లా కలెక్టర్, నీటి పారుదల శాఖ ఎస్ఈ ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకారం 15 రోజుల పాటు మండల చెరువులకు నీటిని సరఫరా చేశాం. నవంబర్ 25న నీటి విడుదల చేయాల్సి ఉండగా కాలువపై మరమ్మతుల నేపథ్యంలో 10 రోజులు ఆలస్యంగా డిసెంబర్ 5న తాడిమర్రి మండలానికి నీరు చేరింది. అప్పటి నుంచి డిసెంబర్ 25 వరకు నీటిని సరఫరా చేశాం. పై ప్రాంతాల్లో రైతులు కాలువకు గండ్లుకొట్టి నీటిని తమ చెరువులకు మళ్లించుకుంటుంటే సొంత ఖర్చులతో జేసీబీలు ఏర్పాటు చేసి గండ్లను పూడ్చుతూ తాడిమర్రి మండల చెరువులకు నీటిని సరఫరా చేశాం. –టీ.కే.చెన్నారెడ్డి, జేఈ, బత్తలపల్లి, ధర్మవరం కెనాల్

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

గాండ్లపెంట: 12వ పీఆర్సీ నివేదిక ఆలస్యం అవుతుండడంతో వెంటనే ప్రభుత్వం 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రామమోహన్ గురువారం డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్సీలో ఎస్టీయూ నాయకులతో కలిసి ఎంఈఓలు క్రిష్టానాయక్, శ్రీనివాసులు నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను అవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ అధ్యాపకులుగా ప్రమోషన్‌లు కల్పించాలని, యాప్‌ల భారం తగ్గించాలన్నారు. అనంతరం సైతం ఎంఈఓలు ఏపీటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీలను అవిష్కరించారు. ఉపాధ్యాయులు షౌకత్, రమేష్, చక్రపాణి, మనోహర్, చంద్ర, సాదిక్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


గాండ్లపెంటలో ఎస్టీయూ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

పుట్టపర్తి: బుక్కపట్నం బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లను ఎంఈఓలు గోపాల్‌నాయక్, మోహన్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ ఆలస్యమవుతున్నందున వెంటనే 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. మండలాధ్యక్షుడు శంకర్ నారాయణ, రామాంజినేయులు, సత్యప్ప, భాస్కర్‌చౌదరి, ఓబులేసు, ప్రమీలమ్మ, మంజులమ్మ, వనజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నూతన క్యాలెండర్లను ఎంఈఓలు లలితమ్మ, కళ్యాణి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలాధ్యక్షుడు ఖాజా మొహిద్దీన్, ప్రధాన కార్యదర్శి గణేష్, కోశాధికారి మహమ్మద్ షరీఫ్, నాయకులు బాలకృష్ణారెడ్డి, కొలిమి గౌసియా, షబీన్ బాను, గంగాధర్‌నాయక్, కిషోర్‌కుమార్, సరస్వతి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: డీఏ, 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక విద్యాశాఖ అధికారి కార్యాలయంలో గురువారం ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్టీయూ నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులందరికి పెండింగ్‌లో ఉన్న డీఏలను, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం నియమించిన 12వ పిఆర్‌సీ కమీషన్ రాజీనామా చేసినందున వెంటనే పిఆర్‌సీ కమీషన్‌ను నియమించి నిర్ణీత కాలపరిమితిలోపు నివేదిక తెప్పించుకొని పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి, అసోసియేట్ అధ్యక్షుడు జవహర్, గౌరవాధ్యక్షుడు రామాంజులుయాదవ్, వీరమహేశ్వర, ధనుంజయరెడ్డి, రమణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చేతన్


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ కిష్టప్ప

బత్తలపల్లి: ఏపీటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీలను బత్తలపల్లి ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్ ఆవిష్కరించారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏపీటీఎఫ్ జనరల్ సెక్రటరీ నాగశేషణ, అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఏపీటీఎఫ్ నాయకులు తిమ్మప్ప, నాగరాజు, నాగేశ్వరయ్య, శ్రీలక్ష్మీ, ఉషారాణి, అలివేలుమంగ, హరికృష్ణ, ప్రహ్లాద్, కిషోర్, నరసింహమూర్తి, భాస్కర్, మస్తాన్‌వలి, వెంకటనారాయణ, తిప్పేస్వామి, నరేంద్ర, నారాయణస్వామి, రాజేశ్వరి, విజయలక్ష్మీ, సునిత, విజయవాణి, మాధవి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: స్థానిక ఎమ్మార్సీలో గురువారం ఏపీటీఎఫ్-1938 నూతన క్యాలెండర్లు, డైరీని ఎంఈఓలు సురేష్‌కుమార్, రమణ ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు బడా భార్గవరెడ్డి, ప్రధాన కార్యదర్శి నారాయణ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ఏపీయూఎస్ క్యాలెండర్‌ను ఎంఈఓలు విడుదల చేశారు. యూనియన్ మండలాధ్యక్షుడు రామూనాయక్,ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం క్యాలెండర్‌ను కలెక్టర్ చేతన్ గురువారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ క్రీడాపోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలు, క్రీడా పోటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి రామకృష్ణ, నాయకులు ఓబులేషు, రమేష్, రామక్రిష్ణ, సూర్యనారాయణ, జగదీష్, దివాకర్‌యాదవ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: సీహెచ్‌ఓలు, ఎంపీహెచ్ఓ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్లను డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ తిప్పయ్య, డాక్టర్ నాగేంద్రనాయక్, డాక్టర్ నివేదిత నాగరాజు, డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీహెచ్ఓలు, ఎంపీహెచ్ఓలు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వన్నప్ప, జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి మోహన్‌బాబు, రాష్ట్ర సహాధ్యక్షుడు రాజశేఖర్, ట్రెజరర్ బాలాజీరావు, జిల్లా సహాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నగేష్, మోహన్, కుమారరెడ్డి, రమణ తదితరులు ఉన్నారు.

ఎంఈఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

నల్లమాడ: మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ నూతన సంవత్సరం కేలండర్లను గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేమనారాయణ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ మాట్లాడుతూ ఎంఈఎఫ్ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడుతోందన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు వెంకట్రామిరెడ్డి, ఎంఈఎఫ్ నాయకులు నరసింహులు, రమేష్, దివాకర్, నాగభూషణం, సూరి, రామాంజనేయులు, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రమేష్‌బాబు, నాగరాజు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఏపీఎస్‌టీఏ) నూతన క్యాలెండర్‌ను జిల్లా విద్యాధికారి కిష్టప్ప, సమగ్ర శిక్ష ఏపీసీ దేవరాజ్, ఏపీఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని మేనేజ్‌మెంట్ల టీచర్లు ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చేలా సంఘాన్ని ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమన్నారు. ఈ సందర్భంగా విద్యాధికారులను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, కోశాధికారి పుల్లయ్య, జిల్లా నాయకులు నరేష్‌కుమార్, మక్కిశెట్టి కుమార్, ప్రదీప్ కుమార్, శ్రీనివాసులు, ఓబులేసు, కిష్టప్ప, రమేష్ ఉన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


తనకల్లులో మాట్లాడుతున్న ఎంఈఓ లలితమ్మ

తనకల్లు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు భాగస్వాములవ్వాలని ఎంఈఓలు లలితమ్మ, కళ్యాణి సూచించారు. స్థానిక ఎమ్మార్సీలో గురువారం హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాఠశాలల అభివృద్ధి కోసం తగిన సలహాలు, సూచలను అందించాలన్నారు. ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు కొన్ని బాధ్యతలు, విధులను అప్పగించిందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: స్కూల్ కమిటీ చైర్మన్లు పాఠశాల సమగ్ర అభివృద్ధికి దోహదపడాలని ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం వివిధ పాఠశాలల స్కూల్ కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల యాజమాన్య కమిటీ విధి, విధానాలు, సమావేశాల నిర్వహణ, బాలల హక్కులు, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, సమకాలిన సమస్యలపై శిక్షణ ఇచ్చారు. డీఆర్‌పీలు రామాంజినేయులు, బాబావలి, రెడ్డప్ప పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 4 అర్జీలు

అమడగూరు: పూలకుంటపల్లిలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 4 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ రామనాథరెడ్డి పేర్కొన్నారు. రీ సర్వే సమయంలో తలెత్తిన సమస్యలపై 4 మంది రైతులు అర్జీలను ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. శుక్రవారం లోకోజుపల్లిలో నిర్వహించే సదస్సుతో మండలంలో రెవెన్యూ సదస్సులు ముగుస్తాయన్నారు.

సౌత్‌జోన్ హాకీ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, పీడీ ఆనంద్

ధర్మవరం అర్బన్: సౌత్‌జోన్ హాకీ పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు లోకేష్, ఓంశేఖర్, నాగరాజు, బాల ఓబిలేసు గత నెలలో ఎస్‌కే యూనివర్శిటీ నిర్వహించిన సెలక్షన్లలో ప్రతిభ కనబరిచి ఎస్‌కే యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారన్నారు. కళాశాల ఇంటర్ కాలేజీ టోర్నీలో రన్నర్స్‌గా నిలిచారన్నారు. సౌత్‌జోన్‌కు ఎంపికైన విద్యార్థులు ఈనెల 3 నుంచి చైన్నైలో ప్రారంభమయ్యే సౌత్‌జోన్ హాకీ పోటీలకు యూనివర్సిటీ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కళాశాల పీడీ ఆనంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయిలో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో ధర్మవరం బాలికల జట్టు రన్నర్స్‌గా నిలవడం హర్షణీయమని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్ బాల్ కోర్టులో గురువారం క్రీడాకారిణులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో చిత్తూరు పీఈఎస్ పబ్లిక్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి ఇంటర్ స్కూల్ స్టేట్ లెవెల్ టోర్నీలో ధర్మవరం బాలికల జట్టు చిత్తూరు జిల్లాకు చెందిన బంగారుపాలెం జట్టుతో ఫైనల్స్‌లో తలపడగా ధర్మవరం జట్టు 34 పాయింట్లతో రన్నర్స్‌గా నిలిచిందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు ఇదయతుల్లా, కోచ్ సంజయ్ ఉన్నారు.

సర్వేలు వేగవంతం చేయండి

అమడగూరు: సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మునెప్ప పేర్కొన్నారు. గురువారం ఆయన గుండువారిపల్లి, తుమ్మల గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేలను పరిశీలించారు. తుమ్మల గ్రామంలో సర్వేలన్నీ వెనకబడి ఉన్నాయని, ఉన్నత స్థాయి అధికారుల నుంచి ఒత్తిడి ఉందన్నారు.

క్లుప్తంగా

మున్సిపల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ధర్మవరం అర్బన్: ఆర్డీటీ లీగ్ మ్యాచ్‌లో కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల హెచ్‌ఎం పద్మావతి తెలిపారు. పాఠశాలలో గురువారం క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మాట్లాడుతూ అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జరిగిన క్రికెట్, కబడ్డీ పోటీల్లో తమ పాఠశాల క్రీడాకారులు ప్రతిభ చూపారన్నారు. క్రికెట్ అండర్-12 విభాగంలో పాఠశాల విద్యార్థి రాజా జిల్లా జట్టుకు ఎంపికయ్యాడన్నారు. కబడ్డీలో విద్యార్థులు జయంత్, యశ్వంత్, ఆసిఫ్, నూర్ మహమ్మద్, యేసురాజు, లోకేష్, వంశీ, మనోహర్‌రెడ్డి, నవదీప్ ప్రతిభ చాటారని హెచ్‌ఎం తెలిపారు.

కంది విక్రయానికి పేర్లు నమోదు చేసుకోండి

ముదిగుబ్బ: ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంటను విక్రయించడానికి రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ లక్ష్మీనరసింహులు గురువారం తెలిపారు. అలాగే రబీలో సాగు చేసిన పంటలకు ఈ- క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు.

జూనియర్ కళాశాలకు వంటపాత్రలు, ప్లేట్ల వితరణ



దాతలను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి


ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు దాతలు వంటపాత్రలు, ప్లేట్లు వితరణగా అందించారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పల్లెం వెంకటేష్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పల్లెం జనార్దన్ దంపతులు రూ.60 వేలు విలువ చేసే వంట సామగ్రి, ప్లేట్లను గురువారం కళాశాలకు అందించారు. దాతలను ప్రిన్సిపాల్ శాలువాలతో సన్మానించారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్ నాయుడు

చెన్నేకొత్తపల్లి: పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి-2 ప్రసూన్‌కుమార్ నాయుడు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీలు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతి తదితర అంశాలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇందుకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు కేశవరెడ్డి, రవికుమార్, భూషణప్ప ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందనలు


యోగానందను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బత్తలపల్లి: స్కూల్ గేమ్స్ అండర్-14 క్రికెట్ పోటీల్లో రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి యోగానంద ప్రతిభ చాటడంతో గురువారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో అనంతపురం జిల్లా జట్టు తరఫున యోగానంద ప్రాతినిధ్యం వహించారు. జట్టు రన్నరప్‌గా నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు, పీఈటీ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి తండ్రి సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి

తాడిమర్రి: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ముందుగా ఆలయంలో మహాగణపతి, కుమారస్వామి, అయ్యప్పస్వామి చిత్ర పటాలకు పూలమాలలు వేసి అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి సత్యనారాయణస్వామి ఆధ్వర్యంలో మాలధారులకు ఇరుముడి కట్టారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి మాలధారులు 108 శరణాలు పలుకుతూ భజనలు చేశారు. అనంతరం ఇరుముడి ధారులు శబరిమలకు తరలి వెళ్లారు.

అయ్యప్ప గ్రామోత్సవం

చెన్నేకొత్తపల్లి: మేడాపురంలో గురువారం రాత్రి అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి చిత్రపటాన్ని రథంలో కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. మాలధారులు భక్తిగీతాలు ఆలపించి, సందడి చేశారు. భక్తులు స్వామికి ఫల, పుష్పాలను సమర్పించి పూజలు చేశారు.

ఘనంగా మండల పూజ

ముదిగుబ్బ: గుంజేపల్లిలో గురువారం పెద్దమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట జరిగి 41 రోజు పూర్తి కావడంతో అమ్మవారికి మండల పూజ ఘనంగా నిర్వహించారు. టీటీడీ వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహ వచనం, అమ్మవారి మూల మంత్ర హోమం దుర్గాసూక్త హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను చేపట్టాచారు.

9న మెగా జాబ్‌మేళా

ధర్మవరం: పట్టణంలోని సీఎస్‌బీ కల్యాణ మండపంలో ఈనెల 9న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి బండ్ల హరికృష్ణ గురువారం తెలిపారు. మంత్రి సత్యకుమార్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంస్కృతి సేవా సమితి సహకారంతో జరిగే జాబ్‌మేళాకు 90 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. వివరాలకు 9182288465, 9490442576, 9390176421 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్వెట్టర్ల పంపిణీ

కదిరి అర్బన్: పట్టణంలోని పలు కూడళ్లలో జీవిస్తున్న అనాథలకు గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్వెట్టర్లు పంపిణీ చేశారు. చలికి ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, అనాథలకు సామాజిక బాధ్యతలో భాగంగా కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. నాయకులు ఆజంబాషా, ఖాజామోహియుద్దీన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌లో నాగుపాము



చెన్నేకొత్తపల్లి: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన ఉన్న ఓ హోటల్‌లోకి గురువారం సాయంత్రం నాగుపాము చొరబడింది. భయాందోళనకు గురైన హోటల్ నిర్వాహకులు బయటకు పరుగులు తీశారు. వెంటనే పాములు పట్టే వ్యక్తికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన హోటల్ వద్దకు చేరుకున్న పాములు పట్టుకునే వ్యక్తి.. చాకచక్యంగా పామును పట్టుకున్నాడు. పామును ప్లాస్టిక్ డబ్బాలో బంధించిన అనంతరం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వదిలేశాడు. దీంతో హోటల్ నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్‌టీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రవికుమార్

రామగిరి: శ్రీసత్యసాయి జిల్లా నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టీఎఫ్) ఉపాధ్యక్షుడిగా మండలంలోని పేరూరుకు చెందిన సాకే రవికుమార్ ఎంపికయ్యారు. ధర్మవరంలో జరిగిన సమావేశంలో ఎన్‌టీఎఫ్ జాతీయ అధ్యక్షుడు కంబా రవిబాబు, రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఉదయ్ కుమార్ ఆదేశాలతో రవికుమార్‌ను నియమించారు.

In the court of the Senior Civil Judge, Penukonda

E.P. No: 7/2021 in O.S. No: 4/2016

Between :
Avutala Bhaskar Reddy, S/o A. Basi Reddy aged about 75 years, agriculturist, Buchaiahgari palli, Bukkapatnam Mandal. ...Petitioner/D.Hr

And

Mota Ravindra, S/o Mota Kullayappa, aged about 52 years, agriculturist, Lingappagari palli, Siddarampuram Panchayat, Bukkapatnam Mandal. ...Respondent/J.Dr.

వేలం ప్రకటన

యిందుమూలముగా యావన్మందికి తెలియచేయడమేమనగా పై నెంబరు **E.P** లోని షెడ్యూలు లోని 1 మరియు 2 అయిటములను కోర్టువారు **21-01-2025వ తేదీన ఉదయం 10-30 గంటలకు** కోర్టు ఎదుట బహిరంగముగా వేలము వేయుదురు. కావున సదరి వేలంలో పాల్గొనదలచిన వారు పాల్గొనవచ్చునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

షెడ్యూలు

Description of the properties situate within the RD of Hindupur SRD of Bukkapatnam with in the limits of Siddarampuram Revenue Village, Bukkapatnam Mandalam.

S.No.	Babu	S.No.	Extent	D.Hr Value	
1	G.Dry	329	Ac 0.65	65,000/-	Govt. Market value 1 & 2 అయిటములకు Rs.4,74,000/-
2	G.Dry	533-1	Ac 3.30	3,60,000/-	

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

ఆర్. శ్రీకాంత్ రెడ్డి, అర్జీదారుపరం వకీలు, పెనుకొండ